ఏలూరు రాజేష్ శర్మకు రితిక ఫౌండేషన్ నంది అవార్డు

విశాలాంధ్ర-పెందుర్తి : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఉత్తరాంధ్ర పురోహిత మిత్ర వ్యవస్థాపకులు, అర్చకులు ఏలూరు వెంకట రమణమూర్తి (రాజేష్ శర్మ) హైదరాబాదుకు చెందిన ప్రముఖ సేవా సంస్థ రితిక ఫౌండేషన్ అందించనున్న బెస్ట్ నంది అవార్డు-2025కు ఎంపికయ్యారు. ఈనెల 25న హైదరాబాదులోని లకిడికాపూల్ రితిక ఫౌండేషన్ కార్యాలయంలో రాజేష్ శర్మకు ఆ సంస్థ ప్రతినిధులు, ప్రముఖులు అవార్డును ప్రధానం చేయనున్నారు. ఈ మేరకు ఆహ్వానం అందుకున్న రాజేష్ శర్మ కుటుంబ సభ్యులు మిత్రులతో కలిసి హైదరాబాదు వెళ్లనున్నారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధిగా ఆయా సామాజిక వర్గీయుల కోసం రాజేష్ శర్మ గత కొన్నేళ్లుగా పేదలకు వైద్య సాయం, పిల్లలకు పుస్తకాలు పంపిణీ, జర్నలిస్టులకు సత్కారం, ఆధ్యాత్మిక బోధనలు వంటి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే రాజేష్ శర్మను గతంలో అనేక సంస్థలు ఘనంగా సత్కరించి అవార్డులను ప్రధానం చేశాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రితిక ఫౌండేషన్ నుండి నంది అవార్డు లభించడం గొప్ప అనుభూతిని కలిగిస్తుందన్నారు. ఈ అవార్డు తనలో మరింత బాధ్యతను, సేవాభిలాషను, ఆధ్యాత్మికతను పెంచిందని పేర్కొన్నారు. తన సేవలను గుర్తించిన రితికా ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

మంగరాజురెడ్డి మృతికి సిపిఐ నివాళి

విశాలాంధ్ర-విశాఖ : సిపిఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ బోర మంగరాజు రెడ్డి అనారోగ్యంతో గురువారం రాత్రి మద్దిలపాలెంలోని స్వగృహం మలో మరణించారు. మంగరాజురెడ్డి మృత దేహాన్ని సిపిఐ ప్రతినిధి బృందం శుక్రవారం ఉదయం సందర్శించి, నివాళులర్పించింది. ఆయకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్న రోజుల్లో కామ్రేడ్ మంగరాజు రెడ్డి పట్టుదలగా పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తూ మద్దిలపాలెం ఏరియాలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం కృషి చేశారు. గత 8సంవత్సరాలుగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్, సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యుడు ఎస్.నాగభూషణం, జిల్లా సమితి సభ్యుడు పడాల గోవింద్, పైలా ఈశ్వరరావు, సీహెచ్ కాసుబాబు, డి.సత్తిబాబు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బలమైన కుటుంబ వ్యవస్థ భారతదేశానికి వరం

సదస్సులో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ హరినాథ్

విశాలాంధ్ర-మల్కాపురం : బంధాలు-అనుబంధాలతో కూడిన భారత కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శప్రాయమని ఆంధ్ర విశ్వ విద్యాలయ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ అన్నారు. స్థానిక ఆంధ్ర విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథక సెమినార్ హాల్లో నిర్వహించిన అంతర్జాతీయ కుటుంబ దినోత్సవ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ కుటుంబ వ్యవస్థను సజీవంగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. స్వార్థానికి, అహంకారానికి, అధికార దర్పానికి, సామాజిక దురాచారాలకు కుటుంబం వేదిక కాకూడదని ఆయన అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈ.పీ.ఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కుటుంబానికి మూలమైన వివాహం ఒప్పందం కాకూడదని, అది ఒక అనుబంధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథక వలంటీర్లు కుమారి పి.దివ్యశ్రీ, నాయుడు ప్రసంగించారు. సదస్సులో జాతీయ సేవా పథక కార్యాలయ సిబ్బంది విజయలక్ష్మి, సఫియా, చంటి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడిని రక్షించిన పెందుర్తి పోలీసులు

విశాలాంధ్ర-పెందుర్తి : కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధుడిని పెందుర్తి పోలీసులు రక్షించారు. సీఐ కెవి సతీష్ కుమార్ కథనం ప్రకారం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం, చింతలపాలెం గ్రామానికి చెందిన బోని సత్యం (60) అల్లుడు, కూతురు, భార్య కలిసి తనను బాధిస్తున్నారని భావించి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12:29 గంటలకు 112 ఎమర్జెన్సీ నంబర్‌కు కాల్ చేసి, జంగాలపాలెం వద్దగల వాటర్ ట్యాంక్ మీదకు ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. సమాచారం అందుకున్న వెంటనే పెందుర్తి పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ ను తక్షణమే సంఘటనా స్థలానికి పంపించి బాధితుడిని సమర్థవంతంగా రక్షించి, సురక్షితంగా కిందకి తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు సిఐ తెలిపారు. అనంతరం బాధితుడికి కౌన్సిలింగ్ ఇచ్చి, మానసికంగా ధైర్యం చెప్పి, అతని బంధువులకి అప్పగించామని చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, భయపడకుండా దగ్గరలో ఉన్న కొత్తవలస పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ ఘటనలో పెందుర్తి పోలీసులు సత్వరం స్పందించి ఓ వ్యక్తిని ప్రాణాపాయం నుండి రక్షించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మే 20 సమ్మెను విజయవంతం చేయండి

- కార్మికులకు అఖిలపక్ష సంఘాల పిలుపు
- ప్రధాన డిమాండ్లతో బీసీ గేట్ ఎదుట ధర్నా

విశాలాంధ్ర-గాజువాక : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో మే 20 వ తారీకు సమ్మెను జయప్రదం చేయండి అని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాలు కార్మికులకు పిలుపునిచ్చాయి. శుక్రవారం స్టీల్ ప్లాంట్ బిసి గెట్ వద్ద స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన డిమాండ్లతో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరామ్ అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సిఐటియూ నాయకులు ఎస్ రామారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ లో అప్రకటిత ఎమర్జెన్సీని యాజమాన్యం అనుసరిస్తోందని ఆయన విమర్శించారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘిస్తూ యాజమాన్యం వైఖరి ఉందని ఆయన వివరించారు. ప్రభుత్వ యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా గళం ఎత్తిన కార్మిక సంఘాలను, కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగడం అత్యంత దుర్మార్గమని ఆయన ఆక్షేపించారు. పూర్తిస్థాయి ఉత్పత్తి స్టీల్ ప్లాంట్ లో జరగాలంటే తగిన మానవ వనరులు ఉండాలని యాజమాన్యానికి తెలీదా అని ఆయన ప్రశ్నించారు. కార్మిక సమస్యలను సృష్టిస్తూ యాజమాన్యం అనైతికంగా వ్యవహరిస్తుందని దీనికి వ్యతిరేకంగా కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని మే 20 న జరిగే సమ్మె ను పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తపు సమ్మె వాయిదా పడినప్పటికీ విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మే 20వ తారీకు విశాఖ ఉక్కు కర్మాగారంలో పెద్ద ఎత్తున సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు. స్టీల్ యాజమాన్యం స్టీల్ కార్మికులకు నేటికీ పూర్తి వేతనాలు చెల్లించడంలో వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. అలాగే హెచ్ఆర్ఏ, కరెంటు చార్జీలు పెంపుతో కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను వారి ఉపాధి నుండి దూరం చేసి స్టీల్ ప్లాంట్ ఉత్పత్తులకు తీవ్ర విఘాతాన్ని సృష్టిస్తున్నారని ఆయన వివరించారు. యాజమాన్యం ఇదే వైఖరిని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సభాధ్యక్షులు జె అయోధ్యరామ్, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డివి రమణారెడ్డి, టీ జగదీష్, జె రామకృష్ణ మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం అనైతికంగా అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మిక వర్గం మే 20 జరిగే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై టి దాస్, యు రామస్వామి, స్టీల్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు బి తౌడన్న, ఎఐటియుసి నాయకులు మసేన్ రావు, స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, మరిడయ్య, టీ వి కె రాజు, వి ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మహేష్, రాజు, శ్రీనివాస్ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

93వ వార్డులో నగర మేయర్ విస్తృత పర్యటన

విశాలాంధ్ర-విశాఖపట్నం : 93వ వార్డులో పారిశుధ్య కార్మికుల పనితీరును మెరుగుపరచాలని, రోడ్లు, ప్రధాన కాలువల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని, భూగర్భ మురుగునీటి పారుదల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆయన 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి త్రివేణి వరప్రసాద రావు (రాపర్తి కన్నా), జీవీఎంసీ అధికారులతో కలిసి జోన్ 8 లో, 93వ వార్డు నందు కృష్ణానగర్, విరాట్ నగర్, ప్రహ్లాదపురం తదితర ప్రాంతాల్లో విస్తృత పర్యటన చేశారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ కృష్ణానగర్ విరాట్ నగర్ ప్రహ్లాదపురం తదితర ప్రాంతాల్లో ఉన్న సమస్యలను మేయర్ కు వివరించగా, మేయర్ మాట్లాడుతూ పగలు, రాత్రి పూట విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల విధులలో మార్పులను చేసి వార్డులో నిత్యం పారిశుధ్య పనుల పనితీరును మెరుగుపరచాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ .ఎన్. వి. నరేష్ కుమార్ కు ఆదేశించారు. కృష్ణానగర్, విరాట్ నగర్ లో ప్రధాన గెడ్డ, కాలువల మరమ్మతులను చేపట్టేందుకు అంచనాలను సిద్ధం చేయాలని, నివాసాలు పెరిగినందున పంచాయతీ కాలం నాటి రోడ్లు అయినందున చాలా చోట్ల రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని స్థానికులు కోరగా వాటిని పరిశీలించి రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశిస్తూ,అందుకు స్థానికులు కూడా సహకరించాలని మేయరు తెలిపారు. విరాట్ నగర్ లో గల స్మశాన వాటిక నందు మౌలిక సదుపాయాలను కల్పించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని, ప్రహ్లాదపురంలో అసంపూర్ణంగా వున్న యు జి డి పనులను 15 రోజులలో పూర్తి చేసి ప్రతి ఇంటికి కనెక్షన్లను అందించాలని, పలుచోట్ల కాలువలు, కల్వర్ట మరమ్మతులను గమనించి వాటిని పరిశీలించి మూడు రోజుల్లో నివేదికను సమర్పించాలని, సమీపంలోనున్న కమ్యూనిటీ హాల్ నందు మొదటి అంతస్తు నిర్మాణానికి ప్రతిపాదనలు చేపట్టాలని, కోనేరు అభివృద్ధి పనులను ప్రారంభం కాకపోవడం పై ఆరా తీస్తూ 25వ తేదీ నాటికి సంబంధిత కాంట్రాక్టర్ ప్రారంభించనట్లయితే ఆ పనిని రద్దుచేసి కొత్త టెండర్లను పిలవాలని కార్యనిర్వాహక ఇంజనీర్ దిలీప్ ను మేయర్ ఆదేశించారు. అనంతరం వితంతు పింఛను మంజూరు చేయాలని ఒక వితంతువు కోరగా పరిశీలించి వెంటనే పింఛను అందించే ఏర్పాటు చేయాలని, 94వ వార్డు ఎస్ ఎస్ ఎస్ కొబ్బరి తోట నివాసితులు ఖాళీ స్థలంలో పార్కును మంజూరు చేయాలని వినతి పూర్వకంగా కోరగా వాటిని పరిశీలించి నివేదిక అందించాలని ఎసిపి శాస్త్రికి, జోనల్ కమిషనర్ హేమావతికి మేయర్ సూచించారు. పర్యటనకు హాజరైన సచివాలయాల కార్యదర్శులతో మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రజలకు అందించవలసిన సేవలు అసంతృప్తిగా ఉన్నాయని చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని వారిని మేయర్ ఆదేశించారు. వార్డులలో ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలలో, అందించవలసిన సంక్షేమ పథకాలలో అలసత్వం, నిర్లక్ష్యం వహించకుండా అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ హేమావతికి మేయర్ సూచించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ సంపత్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీధర్, మురళీకృష్ణ, సహాయ వైద్యాధికారి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో లక్షల మందితో ప్రధాని యోగాసనాలు

- మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్
- ఆర్‌కె బీచ్ నుంచి సముద్ర తీరం పొడవునా లక్షల మందితో యోగా డే నిర్వహణ
- జూన్ 21 విశాఖలో ప్రధాని పాల్గొనే యోగా డే నిర్వహణపై సీఎం సమీక్ష

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దేను రికార్డు సృష్టించేలా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. జూన్ 21వ తేదీన జరిగే యోగాడే కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈసారి విశాఖలో పాల్గొంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రధాని స్వయంగా ప్రకటించారు. దీంతో ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. గ్రాండ్ సక్సెస్ చేసే అంశంపై ఫోకస్ పెట్టిన సిఎం, కార్యచరణపై క్యాంప్ ఆఫీస్‌లో అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' ను ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్‌గా తీసుకున్నారు. 'జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. ప్రధాని వస్తున్న ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించడంతో పాటు..రాష్ట్రంలో యోగా అభ్యాసానికి ఇది నాంది పలకాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి. కనీసం రెండు కోట్లమందికి ఈ కార్యక్రమం చేరాలి. 'యోగాంధ్ర-2025' థీమ్‌తో రాష్ట్రంలో ప్రచారం చేపట్టాలి. దీని కోసం ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలి. ఈ నెల రోజులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా ప్రాక్టీస్ జరగాలి. దీని కోసం ప్రైవేటు వ్యక్తులు, శిక్షకులు, యోగా అసోసియేషన్లు, నిపుణులను భాగస్వాములను చేయాలి. నెలరోజుల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ప్రజలకు యోగా పై శిక్షణ ఇవ్వాలి. నెల రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారిని గుర్తిస్తూ సర్టిఫికెట్ ఇవ్వాలి. రాష్ట్రంలో గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా యోగా డేలో పాల్గొనే అంశంపై ప్రజల నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలి. అదే విధంగా రాష్ట్రంలోని స్కూళ్లు, కాలేజీల విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలి.

లక్షల మందితో కార్యక్రమం... ఆర్‌కె బీచ్‌లో ప్రధాని కార్యక్రమం, ప్రజల పాల్గొనే ప్రాంతాలు, నిర్వహణపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆర్కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు అన్ని చోట్లా ప్రజలు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్ వరకు సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

యోగాలో కొత్త రికార్డ్ సృష్టిద్దాం : ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా డేగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. యోగా డే రోజుల ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా సాధన ఉంటుంది. 2015లో తొలిసారి అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు 36 వేల మందితో ఒకే వేదికపై నిర్వహించిన కార్యక్రమం గిన్నిస్ రికార్డుకు ఎక్కింది. తొలి ఏడాది 84 దేశాల్లో యోగాను నిర్వహించారు. ప్రపంచంలోని 170కి పైగా దేశాలు యోగా డే ను ప్రస్తుతం నిర్వహిస్తున్నాయి. 2023లో సూరత్‌లో 1,53,000 మందితో ఒకే చోట అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరిపి మరోసారి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లకు ఎక్కింది. సూరత్ తరహా మోడల్‌లో విశాఖలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించి... ఈసారి ఆ రికార్డును తిరగరాయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ, ఆయుష్, కేంద్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

'జాతీయ డెంగ్యు దినోత్సవ' ర్యాలీ నిర్వహణ

-మూడు పద్ధతులను పాటించండి-డెంగ్యును ఓడించండి అనే నినాదంతో భారీ ర్యాలీ

ఇంటి చుట్టు ప్రక్కల దోమల ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో చూడండి అటువంటి నీటి నిల్వలుశుభ్రం చేయండి లేదా తొలగించండి

నీరు నిల్వ ఉండే తొట్టెలు, డబ్బాలు వంటివాటిపై మూతలు ఉంచండి



విశాలాంధ్ర-విశాఖపట్నం : తేది.16-05-2025న జాతీయ డెంగ్యు దినోత్సవము సందర్భముగా జి.వి.యం.సి సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, డిస్ట్రిక్ట్ మలేరియా సిబ్బంది మరియు జోనల్ మలేరియా సిబ్బంది సంయుక్తముగా కలసి భారీ ర్యాలీ నిర్వహించడం జరిగినదని జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి పేర్కొన్నారు. ఈ ర్యాలీని రీజినల్ డైరెక్టర్ అఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీస్ డాక్టర్ రాధారాణి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి కార్యాలయము నుండి ప్రారంభమై బుల్లయ్య కాలేజి పరిసర ప్రాంతాలలో నిర్వహించారు. ప్రజలలో డెంగ్యు వ్యాధి గురించి అవగాహనా పెంపోదించడం, నివారణ చర్యలపై దృష్టి పెట్టడం ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గత పది సంవత్సరముల నుండి డెంగ్యు వ్యాధి తగ్గించడంలో గణనీయమైన ప్రగతిని సాధించిందన్నారు. రాష్ట్ర&లో 26 జిల్లాల్లో ఐదు జిల్లాలు కర్నూలు, నంద్యాల, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ జిల్లాలలో డెంగ్యు కేసులు నమోదు అవుతున్నాయన్నారు. దోమలు ప్రజా ఆరోగ్యానికి ప్రధాన శత్రువులు దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యు, చికున్ గున్యా, మెదడువాపు, జికా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. మన ఇల్లు మరియు పరిసారాలలో సాదారణముగా, ఏనాఫిలస్, క్యూలెక్స్, ఏడిస్, మాన్స్ నియా, ఆర్మిజరిస్ దోమలు పెరుగుతాయి. డెంగ్యు అనేది వైరస్ జ్వరం ఇది ఏడిస్ దోమ కాటు వలన వ్యాప్తి చెందుతుంది ఈ దోమ ముఖ్యముగా పగటి పూట కుడుతుంది. ఒక్కసారిగా వచ్చే అధిక జ్వరము, కంటి వెనుక నొప్పి, కండరాల నొప్పి, జుట్టు ఊడి పోవడము, చర్మముపై ఎర్రటి మచ్చలు, డెంగ్యు జ్వర లక్షణాలన్నారు. దోమలు వ్యాప్తి అరికట్టుటకు తీసుకొను చర్యలు దోమ లాటు రక్షణ కొరకు తీసుకొను చర్యలు ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసారాలను పరిశుభ్రముగావుంచుకొని నీరు నిలువ లేకుండా చూసుకొని, ఫ్రేడే డే డ్రై డే కార్యక్రమమును పాటించి దోమల ఉత్పత్తిని అరికట్టుటలో భాగస్వామ్యములు కావలనని ఈ ర్యాలీ ద్వారా తెలియ పరచడమైనది. ఈ ర్యాలీ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ పి.జగదీశ్వరరావు, జోనల్ మలేరియ ఆఫీసు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.ఎస్. ప్రసాద రావు, జిల్లా మలేరియా ఆఫీసర్ ఎం. తులసి, జిల్లా ఇమ్యునైజేషణ్ ఆఫీసర్ డాక్టర్ లూసి, ఉమన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సమత, పి.ఓ. ఎం.సి.డి. డాక్టర్ హారిక, డిస్ట్రిక్ట్ సర్వేలన్స్ ఆఫీసర్ జగదీష్ ప్రసాద్, డి.ఇ.ఎం.ఓ. బి. నాగేశ్వరరావు, డి.సి.ఎం.ఓ. ఉమావతి, బయాలజిస్ట్ డి. సాంబమూర్తి మొదలగు వారు పాల్గొని ర్యాలీని జయప్రదం చేశారన్నారు.

మధురవాడలో 87.80 ఎకరాల్లో పీపీపీ ప్రాజెక్టు

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎంసీ విశ్వనాథన్

విశాలాంధ్ర-విశాఖ : 2047 నాటికి రాష్ట్రం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశిస్తున్న లక్ష్యాలను చేరుకునేందుకు పలు ప్రాజెక్టులు చేపడుతున్నామని విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో క్రెడాయ్, నారెడ్కో, అప్రెడా ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మధురవాడలో 87.80 ఎకరాల భూమిని ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి విశాఖపట్నం వరకు బీచ్ కారిడార్‌ను అభివృద్ధి చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులు 3నుండి 6 నెలల వ్యవధిలో ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. మధురవాడలోని స్థలం కన్వెన్షన్ సెంటర్లు, హాస్పిటాలిటీ, రెసిడెన్షియల్, కమర్షియల్, ఎంటర్టైన్మెంట్ తదితర నిర్మాణాలకు అనువుగా ఉంటుందని తెలిపారు. మెట్రో స్టేషన్ కు 100 మీటర్ల దూరంలోనే ఉందని, ముఖ్యమైన రహదారులతో అనుసంధానమై ఉందని, డేటా సిటీ ఆఫ్ సౌత్.. కాపులుప్పాడకి కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. ఐటీ సిటీ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరువలో ఉండడం అదనపు ఆకర్షణ అని తెలిపారు. దేశంలోనే విశిష్ట స్థానం కలిగిన విశాఖపట్నానికి రాబోయే కాలంలో ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఈనెల 23న హైదరాబాదులో, 30న బెంగుళూరులో ఈ భూమికి సంబంధించి రోడ్ షో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కమీషనర్ కె.రమేష్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ప్రణాళికాధికారులు వెంకటేశ్వర రావు, అరుణవల్లి, చామంతి, మౌనిక పాల్గొన్నారు.

గీతంలో 6జి కమ్యూనికేషన్‌లపై ఎఫ్‌డిపి ముగింపు

విశాలాంధ్ర-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టమ్స్, 6జి కమ్యూనికేషన్లపై జరుగుతున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కార్యక్రమం(ఎఫ్‌డిపి) శుక్రవారం తేది:16-05-2025న ముగిసింది. ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమల నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఎన్ఐటి వరంగల్ నుంచి ప్రొఫెసర్ మహమ్మద్ ఫరూఖ్ హష్మి ఐఓటి అప్లికేషన్‌ల కోసం కృత్రిమ మేధస్సుపై ప్రసంగించారు. 6జిలో ప్రాముఖ్యత మరియు సవాళ్ళను కమ్యూనికేషన్లు, ఆర్.ఎఫ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, సిస్టమ్ డిజైన్ అంశాలపై వివరించారు. 5జి,6జి సెల్యూలర్ సిస్టమ్‌ల కోసం వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఛానల్ అంశాలు, సహకార కమ్యూనికేషన్ల మరియు అనుకరణ నమూనాలను తదుపరి తరం 6జి వ్యవస్థలను భద్రపరచడం, పారిశ్రామిక ఎంబెడెడ్ సిస్టమ్‌లలో 4.0 అప్లికేషన్ అభివృద్ధి గురించి వివరించారు. ఈ ఎఫ్‌డిపి కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్ర కుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్‌లు డాక్టర్ ఎస్.నీరజ, డాక్టర్ సి.హెచ్.సుధీర్, డాక్టర్ టి.గౌరి, సదస్సు ముగింపులో పాల్గొన్న ప్రతిభావంతులందరికి సర్టిఫికేట్‌లు అందజేశారు.

వార్డు అభివృద్ధికి నూతన ఆలోచనతో సహకరించండి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి : భీమిలి జోన్ అభివృద్ధికి నూతన ప్రణాళికతో సిద్ధం కావాలని అందుకు మా సహకారం సంపూర్ణంగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు నూతన కమీషనర్ నమ్మి అయ్యప్పకు విజ్ఞప్తి చేసారు. భీమిలి జోన్ కు నూతనంగా వచ్చిన కమీషనర్ నమ్మి అయ్యప్పను 3వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి శాలువా, ఫ్లవర్ బొకేతో శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ భీమిలికి ఒక మంచి చరిత్ర ఉందని అన్నారు. ఆ చరిత్రకు ఎటువంటి మచ్చ లేకుండా అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. భీమిలి ప్రజలు సౌమ్యులని, అధికారులు తీసుకున్న ఎటువంటి మంచి నిర్ణయానికైనా పూర్తిస్థాయి సహకారం ఉంటుందని అన్నారు. సచివాలయం వ్యవస్థను గాడిలో పెట్టాలని అన్నారు. సంబంధిత అధికారులతో గ్రామాల్లో సందర్శించి స్థానిక సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అందుకు మా తెలుగుదేశం పార్టీ నుండి పూర్తిగా మద్దతు ఉంటుందని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చరకల రమణ, కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, కొక్కిరి అప్పన్న, గిడుతూరి శ్రీనివాసరావు, వాడమొదలు సత్యారావు, జలగడుగుల మురళి, సంకురుభుక్త జోగారావు, రాజగిరి రమణ, కుప్పిల గురుమూర్తి, వియ్యపు పోతురాజు, నెక్కెళ్ళ వెంకటరావు, గండిబోయిన పోలిరాజు, కాసరపు ఎల్లాజీ, మట్టా దాసు, అప్పికొండ నర్సింగరావు, సత్తరవు చిన్నారావు, కందుల సుందర్ రావు, కృష్ణారావు మాస్టర్, చింతపల్లి రాము, వెంకటరావు, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని సర్వర్లు... జనం నిరీక్షణ

విశాలాంధ్ర-అనందపురం : రేషన్ కార్డులు, పింఛన్లు ఇస్తామన్న ఆదేశాల మేరకు ఎంతో ఆశతోఎదురుచూస్తున్న లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయం ఎదుట బారులు తీరుతున్నారు. మండలంలో పంచాయతీలో ఒక్కటైన ఆనందపురం గ్రామపంచాయతీ సచివాలయంలో కొత్త రేషన్ కార్డులు, వితంతు పింఛన్లు ప్రక్రియ మొదలుకానున్న నేపథ్యంలో రేషన్ కార్డులు, వితంతు పింఛన్లు మంజూరుకు అప్లై చేసుకున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో సర్వర్లు పనిచేయకపోవడంతో రేషన్ కార్డు దరఖాస్తు చేసుకునేవారు సచివాలయాల వద్ద బారులు తీరుతు సర్వర్లు పనిచేయక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు కేవలం ఒకటి రెండు దరఖాస్తులు మాత్రమే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని రోజంతా చేస్తున్న సర్వర్ పనిచేయకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నామని సచివాలయం డిజిటల్ సిబ్బంది పేర్కొన్నారు. కుటుంబ సభ్యులంతా ఈ కేవైసీ వేయవలసి ఉండగా ముందుగా వచ్చిన దరఖాస్తులు చేసుకుందామని ఆశతో వచ్చిన లబ్ధిదారులు సచివాలయ వద్ద పడికాపులు కాస్తున్నారు. అనందపురంలో రోజుకి 30 మంది వరకు లబ్ధిదారులు దరఖాస్తుల కొరకు వస్తున్నారని కేవలం ఒకటి,రెండు మాత్రమే చేయడం జరుగుతుందని సచివాలయం సిబ్బంది తెలిపారు. వితంతు పింఛను కోసం ప్రస్తుతానికి పదిమంది అప్లై చేశారని రేషన్ కార్డు కోసం 50 మంది నుండి దరఖాస్తులు తీసుకున్నామని సర్వర్లు పనిచేసిన తర్వాత సమాచారం అందిస్తామని తెలిపారు. సచివాలయంలో సర్వర్ సమస్యతో పాటు ఉద్యోగుల కొరత కూడా ఉందని తెలిపారు.

నిరంతరాయ విద్యుత్తు సరఫరా అందిస్తున్నాం

టి వి సూర్య ప్రకాష్, ఆపరేషన్స్ డైరెక్టర్, ఏపిఈపిడిసిఎల్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఏపిఈపిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ టి వి సూర్య ప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ డిమాండ్ కు అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేసుకొని నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నామని తెలిపారు. వేసవికారణంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా, నిరంతర విద్యుత్తును వినియోగదారులకు అందించేందుకు ప్రతీ శుక్రవారము కొన్ని ప్రాంతాల సబ్ స్టేషన్లు, లైన్ల నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందనే సమాచారాన్ని వివిధ ప్రసారమాధ్యమాల ద్వారా వినియోగదారులకు ముందుగానే తెలియచేస్తున్నామన్నారు. గురువారం రాత్రి అనకాపల్లి జిల్లాలో సంభవించిన పెనుగాలులు మరియు వర్షం కారణంగా మాడుగుల మండలంలోని సత్యవరం గ్రామం నందు 20 ఎల్ టి స్తంభాలు మరియు 7 హెచ్ టి స్తంభాలు విరిగిపడిన కారణంగా సత్యవరం గ్రామం తో పాటు డి. గొట్టివాడ, సాగరం, కొత్తవలస, కె వేలం పాడు గ్రామాలలోని 1600 సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. త్వరితగతిన రెండు విద్యుత్ స్తంభాలు వేసి పై నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా ను ఉదయం 10 గంటల లోపు పునరుద్ధరించడం జరిగింది. మిగిలిన 25 స్తంభాలను కూడా వేసి సత్యవరం గ్రామానికి కూడా శుక్రవారం సాయంత్రానికి విద్యుత్ ను పూర్తిగా పునరుద్ధరించడం జరిగింది. గురువారం రాత్రి 9.57 గంటలకు విజయనగరం జిల్లా బొబ్బిలి పరిధిలోని సాలిపేట గ్రామంలో భారీ లోడు వాహనం స్తంభాలను లాగడం వలన డిపి నిర్మాణం మరియు 6 ఎల్ టి స్తంభాలు దెబ్బతిన్న కారణంగా గజపతినగరం మండలంలోని సాలిపేట గ్రామానికి మరియు మెంటాడ మండలంలోని వెంకంపేట గ్రామంలోని 264 సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తాత్కాలిక మరమ్మత్తుల అనంతరం సిబ్బంది ప్రత్యామ్నాయం సరఫరా అందించడం జరిగింది. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయం తో పాటు సర్కిల్, డివిజన్ స్థాయిల్లో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయాల పర్యవేక్షణకు లోడ్ మానిటరింగ్ సెల్ 24%ఇ%7 పనిచేస్తున్నాయని వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయడమే ధ్యేయంగా సంస్థ అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా కు సంబందించిన సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫోన్ చేసి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ వెల్ఫేర్ అసోసియేషన్ మజ్జిగ చలివేంద్రం

విశాలాంధ్ర-గాజువాక : శ్రీకృష్ణదేవరాయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షకీలా జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీవ్ర వేసవిలో ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ వితరణ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజలకు సేవలందించడమే శ్రీకృష్ణదేవరాయుల ఆధ్యాత్మిక వారసత్వానికి సరైన నివాళి అవుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. శ్రీకృష్ణదేవరాయులు దానధర్మాలకు చిహ్నమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గూడపాటి శ్రీనివాస రావు, అల్లు రామారావు, డి.భాస్కరరావు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే డెంగ్యూ నుంచి రక్షణ

విశాలాంధ్ర-విశాఖపట్నం : పరిశుభ్రత పాటించడంతోటే డెంగ్యూ వ్యాధి నుంచి రక్షణ లభిస్తుందని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వైరస్ వలన వస్తుందని, ఇది మనిషి నుంచి మనిషికి ఏడిస్ ఈజిప్ట్ దోమల ద్వారా సంక్రమిస్తుందన్నారు. దీన్నే టైగర్ దోమ అని కూడా పిలుస్తారని, ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణలో ఉంటాయని, పగటిపూట మాత్రమే కుడతాయన్నారు. ఇవి 400 మీటర్లు కంటే ఎక్కువ దూరం ఎగర లేవని, డెంగ్యూ వైరస్ తో ఇన్ఫెక్ట్ అయిన దోమలోనే కాకుండా, దోమ గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుంది కాబట్టి త్వరితగతిన ఎక్కువ మందికి వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ దోమ నీటి నిల్వలలో మాత్రమే గుడ్లు పెడుతుందని, ఈ వైరస్ వలన ఒకటి కంటే ఎక్కువసార్లు కూడా డెంగీ రావచ్చును అన్నారు. ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్ళ నొప్పులు, కళ్ళు నొప్పులు, కంటి కదలిక తగ్గటం మరియు నొప్పి, ఒక్కొక్కసారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ళ నుండి రక్తస్రావం, అధిక దాహం, నోరు ఎండిపోవడం వంటివి డెంగ్యూ లక్షణాలు అన్నారు. ముఖ్యంగా డెంగీ జ్వరం, డెంగీ హెమరేజ్ జ్వరం, డెంగీ షాక్ సింద్రోమ్ వంటి లక్షణాల ద్వారా ఈ వ్యాధి బయటపడుతుందని, డెంగీ వైరస్ ఇన్ఫెక్షన్ అయిన తరువాత 3 నుంచి 14 రోజులలో ఈ వ్యాధి రావచ్చు అని చెప్పారు. ఈ వైరస్‌తో ఇన్ఫెక్షన్ అయిన తరువాత సాధారణంగా 80 శాతం మందికి దానంతటదే తగ్గిపోతుందని, వీరికి ఎర్రటి దద్దుర్లు వచ్చిన సమయంలో రక్తంలో ప్లేట్ లెట్స్ తగ్గినా సాధారణ స్థితికి చేరుకుంటారన్నారు. మిగతా రెండు రకాలలో (డెంగీ హెమరేజ్, డెంగీ షాక్ సింద్రోమ్) రక్తంలో ప్లేట్ లెట్స్ బాగా తగ్గడం వల్ల వీరికి చికిత్స అందిస్తూ, ప్లేట్ లెట్లు ఎక్కించవలసి వస్తుందన్నారు. ముఖ్యంగా గర్భిణీ లు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, వీరు త్వరితగతిన చికిత్స చేయించు కోవాల్సి వస్తుందన్నారు. డెంగ్యూ జ్వరాన్ని ప్రాథమికంగా మొదటి వారంలో ఎన్ఎస్1 ర్యాపిడ్ కిట్‌తో గుర్తించవచ్చు అని, రెండవ వారంలో వ్యాధి తీవ్రతను బట్టి మ్యాక్ ఎలైసా పరీక్ష ద్వారా నిర్ధారిస్తారన్నారు. పరిసరాలు పరిశీలించడం, శుభ్రం చేయడం, మూతలు పెట్టి ఉంచడం వంటి మూడు పద్ధతుల ద్వారా ఆర్బోవైరస్ తరగతికి చెందిన డెంగ్యూ వైరస్ వలన వచ్చేడెంగ్యూను నివారించవచ్చు అన్నారు. అందుకే పరిశుభ్రత పాటించండి డెంగ్యూ వైరస్ నుండి రక్షణ పొందండి అని ఆచార్య ఉమామహేశ్వరరావు సూచించారు.

53, 54 వార్డులలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మేయర్ శంకుస్థాపనలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల 53, 54 వార్డులలో నేషనల్ హైవే కు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌లలో ప్రజల ఆరోగ్యం, శరీర సౌష్టవం,ఉల్లాసం కొరకు పార్కుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్‌లు, జిమ్ ఎక్విప్మెంట్లు, పిల్లల ఆటల కొరకు చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్ ల నిర్మాణాల కొరకు జీవీఎంసీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు సుమారు 70 లక్షల రూపాయలు మంజూరు చేసిందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు పి.విష్ణుకుమార్ రాజు, 53వ వార్డు కార్పొరేటర్ బరకి శాంతి, 54వ వార్డు ప్రతినిధులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో గ్రీన్ బెల్ట్ లను ఆక్రమణకు గురికాకుండా వాటిని సద్వినియోగం పరుచుకునే క్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్యం,ఉల్లాసం కొరకు, పిల్లల ఆటల కొరకు నేషనల్ హైవే లో పార్వతి నగర్ గ్రీన్ బెల్ట్ నందు 20 లక్షల రూపాయలతో వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్, జిమ్ ఎక్విప్మెంట్ నిర్మాణం, 19 లక్షల 10 వేలతో శ్రీనివాస నగర్ గ్రీన్ బెల్ట్ పార్కు అభివృద్ధి, జిమ్ ఎక్విప్మెంట్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్ నిర్మాణం, 10 లక్షల 60 వేల రూపాయలతో లక్ష్మీ నగర్ గ్రీన్ బెల్ట్ పార్క్ అభివృద్ధి ప్లేగ్రౌండ్ ఏర్పాటు నిర్మాణం, అలాగే 20 లక్షల రూపాయలతో వివేకానంద నగర్ గ్రీన్ బెల్ట్ పార్క్ అభివృద్ధి ఏర్పాటుకు నిర్మాణాల కొరకు శంకుస్థాపన చేయడం జరిగిందని, ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయవలసిందిగా జీవీఎంసీ అధికారులకు ఆదేశించడమైనదని, ఈ అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణాలు పూర్తయిన అనంతరం ప్రజలు ఉల్లాసంగా ఉపయోగించు కోవాలని మేయర్ తెలిపారు. అనంతరం ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఉత్తరం నియోజకవర్గంలో విశాఖ నగర మేయరుగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినందుకుగాను మేయర్ కు అభినందనలు తెలిపారు. మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ఉత్తరం నియోజకవర్గంలో జీవీఎంసీ మంజూరు చేసేందుకు సహకరించాలని మేయర్‌ను కోరారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు నజీర్, ఉషా కిరణ్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1 నాటికి 70 శాతం ప్రాంతాల్లో పర్యటిస్తా : మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పెందుర్తి : నాటికల్లా జీవీఎంసీ పరిధిలోని 70 శాతం ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలిసి ఆయా ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారానికి లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 93వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్న ఆధ్వర్యంలో పలు ప్రాంతాలను సందర్శించిన మేయర్ అక్కడి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా స్థానిక కూటమి నాయకులు ఎర్ర గంగరాజు, గంగవరపు తదితరులు ఆయా ప్రాంతాల సమస్యలను మేయర్ కు వివరించారు ముఖ్యంగా స్మశాన వాటిక అభివృద్ధి మురుగునీటి కాలువలు, ఫుట్ పాత్ లు పునర్నిర్మాణం, విద్యుత్ సమస్యలు, రోడ్ల అభివృద్ధి తదితర అంశాలను ప్రస్తావించి, ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన మేయర్ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గ నిర్దేశంలో నగర పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మేయర్ శ్రీనివాసరావు తెలిపారు. 93 వార్డులోని కొండలపు ప్రాంతాల్లో సరైన కాలువలు లేక వర్షపు నీరు నిలిచిపోతోందని త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే స్మశాన వాటిక అభివృద్ధికి ప్రతిపాదనలున్నట్లు వెల్లడించారు. నగరంలోని స్మశాన వాటికలు అన్ని బాగున్నాయని, 93 వ వార్డులోని స్మశాన వాటిక కొంత బాగాలేదని గుర్తించినట్లు చెప్పారు. స్మశాన వాటిక అభివృద్ధికి టెండర్లు వేసినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదని తెలియజేశారు. త్వరలోనే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని వెల్లడించారు. నగర పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కారానికి అన్ని చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు సిబ్బంది నియామకంపై ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మి, జోనల్ కమిషనర్ హైమావతి ఇతర అధికారులు ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

మేయర్‌ను సత్కరించిన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

విశాలాంధ్ర-విశాఖపట్నం : జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి వి వి నాగరాజు, జనరల్ సెక్రెటరీ ఎం సంజీవరెడ్డి , అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మేయర్ ఛాంబర్ లో విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి విశాఖ నగర మేయర్ పదవిని అధిరోహించినందుకు గాను అభినందనలను తెలుపుతూ ఘనంగా సత్కరించారు. ఈ సత్కార సభలో మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను దక్కించుకున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఇప్పటికే పనులను పూర్తి చేసి, మిగిలిన పనులను పూర్తిచేసేందుకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను మంజూరు చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ కాంట్రాక్టర్లు మేయర్‌ని కోరగా, మేయర్ స్పందిస్తూ సంబంధిత కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల విడుదలపై కమిషనర్ తో చర్చించి బిల్లుల విడుదలకు ఏర్పాటు చేస్తామని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాల్సిందిగా జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులకు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బోరుబావిలోకి మురుగునీరు... పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు చిన ముషిడివాడ, శాంతినగరంలో జీవీఎంసీ తాగునీటిబోరులోకి మురుగునీరు ప్రవహిస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని అక్కడి ప్రజలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. కొన్నాళ్ల క్రితం అక్కడ ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోర్ వెల్ ని కొందరు వ్యక్తులు అర్ధరాత్రి తొలగించడంతో స్థానికులు ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి బోరుని యథా స్థానంలో ఉంచారు. హడావుడిగా డమ్మీ బోర్ ను బిగించి, తొందరలోనే పూర్తి స్థాయిలో పని చేసేలా చేస్తామని అప్పుడు ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ నెలలు గడుస్తున్న ఆ బోరుకు మరమ్మత్తులు చేపట్టలేదు. మరోవైపు కాలువల నుండి మురికి నీరు ఆ బోరులోకి చేరుతోంది. దీంతో అక్కడి ప్రజలు అధికారుల నిర్లక్ష్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి బోరుకి సిమెంటు పళ్ళెం కట్టించి, సుద్ధమైన తాగునీటిని ఈ మండు వేసవిలో ప్రజలకు అందించాలని వారు కోరుకుంటున్నారు.

జీవిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 04 వినతులు

జీవిఎంసి సిటీ ప్లానరు కె.ధనుంజయరెడ్డి

విశాలాంధ్ర-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కి సంబంధించి 04 వినతులు వచ్చాయని జీవిఎంసి సిటీ ప్లానరు కె.ధనుంజయ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జీవిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరంలో సిపిలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం లో జీవిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జీవిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించిన ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు గాను ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి జీవిఎంసి కి సంబంధించిన 04 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 02, 4వ జోన్ కు 01, 5వ జోన్ కు 01 వినతులు వచ్చాయని తెలిపారు. జీవిఎంసి పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చున్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

కెనరా రోబెకో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను విడుదల చేసిన కెనరా రోబెకో

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలోని రెండవ ప్రాచీన అస్తి నిర్వాహకుడైన కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్, మార్కెట్లు బాగా పనిచేస్తున్నప్పుడు అల్ఫాను ఉత్పత్తి చేయడం మరియు మార్కెట్ ఒడిదుడుకులు ఉన్న కాలాల్లో నష్టభయాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్న ఓపెన్-ఎండ్ హైబ్రిడ్ ఫండ్ అయిన కెనరా రోబెకో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ఈరోజు విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈక్విటీ %d% ఈక్విటీ సంబంధిత సాధనాలు, రుణం & మనీ మార్కెట్ సాధనాలు, గోల్డ్ ఇటిఎఫ్‌లు మరియు సిల్వర్ ఇటిఎఫ్‌లలో పెట్టుబడి పెట్టే ఓపెన్-ఎండ్ పథకం, ఈ ఫండ్ డైనమిక్ మల్టీ అసెట్ కేటాయింపు వ్యూహం మార్కెట్ పరిస్థితులను అధిగమించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఆస్తి కారకాలకు ప్రతిస్పందనగా అస్తి తరగతుల కాలానుగుణ ఆప్టిమైజేషన్, సంపదను ఉత్పాదించడం, మార్కెట్ వాల్యుయేషన్ మరియు ఈక్విటీ రిస్క్ ప్రీమియం, పోర్ట్‌ఫోలియో అలైన్‌మెంట్‌ను సులభతరం చేయడంపై ఈ ఫండ్ దృష్టి పెడుతుంది. కొత్త ఫండ్ ఆఫర్ మే 9, 2025న సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవబడుతుంది మరియు మే 23, 2025న ముగుస్తుంది. కెనరా రోబెకో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ ప్రారంభం మా ఉత్పత్తి సమర్పణలను విస్తరించడమే కాకుండా, మార్కెట్ యొక్క అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి రూపొందించబడిన వైవిధ్యభరితమైన పరిష్కారాలను అందించే మా సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది" అని కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రజనీష్ నరులా అన్నారు.

ఇమ్మర్సివ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన శామ్‌సంగ్ గ్యాలక్సీ ఎంపవర్"

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ భూటాన్‌లోని మారుమూల ప్రాంతాల నుండి ప్రగతిశీల విద్యార్థులను దాని వృద్ధి చెందుతున్న కమ్యూనిటీలోకి స్వాగతించింది. కమ్యూనిటీ నేతృత్వంలో 'గ్యాలక్సీ ఎంపవర్' పేరుతో రూపొందుకున్న ఈ ప్రత్యేక కార్యక్రమం విద్యా రంగంలో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు మరియు నిర్వాహకులకు సాధికారత కల్పించడం ద్వారా విద్యలో గణనీయమైన మార్పును తీసుకురావడంపై దృష్టి సారిస్తుంది. డిసెంబర్ 2024లో ప్రారంభించిన 'గ్యాలక్సీ ఎంపవర్' కార్యక్రమం, తరువాగ ఆన్-గ్రౌండ్ మరియు ఆన్‌లైన్ లెర్నింగ్ ఈవెంట్‌ల ద్వారా భవిష్యత్తు దిశగా ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు, లీనమయ్యే వర్క్‌షాప్‌లు మరియు సహకార అభ్యాసం ద్వారా, భూటాన్ ఉపాధ్యాయులు కూడా సాంకేతిక మరియు ఆవిష్కరణలతో తరగతి గదులను పునర్నిర్వచించే ఈ ఉద్యమంలో భాగంయ్యారు. శామ్‌సంగ్, భూటాన్‌లోని మారుమూల మరియు వెనుకబడిన కమ్యూనిటీలలో సేవలందిస్తున్న విద్యార్థుల కోసం 'గ్యాలక్సీ ఎంపవర్' ఇమ్మర్సన్ ప్రోగ్రామ్‌ను గురుగ్రామ్‌లోని దాని ఎగ్జిక్యూటివ్ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించింది.

గృహనిర్మాణ ప్రాజెక్టులపై సమీక్ష

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర పర్యాటక, గృహనిర్మాణ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆ శాఖల ప్రగతిపై, భవిష్యత్ కార్యాచరణపై శుక్రవారం సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఇతర అధికారులతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ముందుగా జిల్లాలోని పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బెల్గాపాక కంపెనీలకు భూ కేటాయింపులు, ప్రభుత్వ సహకారం, సాంకేతిక ప్రక్రియలు, ఇతర అంశాలపై అధికారులను ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పాలసీలకు అనుగుణంగా భూ కేటాయింపులు చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. పర్యాటక శాఖకు అశోక్ లేల్యాండ్, పోర్ట్ లు అందిస్తున్న డబుల్ డెక్కర్ బస్సుల నిమిత్తం ఛార్జింగ్ స్టేషన్లను నెలకొల్పాలని, అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. అంతకుముందు భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులను పరిశీలించిన ఆయన భీమిలి మండలం అన్నవరం వద్ద చేపట్టనున్న ఒబెరాయ్, ఫెయిర్ గ్రూప్ హోటళ్ళ నిర్మాణాలకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు. ఏజెన్సీలో వివిధ స్కీములు కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించిన ఆయన వివిధ అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, లక్ష్యాలకు అనుగుణంగా పని చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ లు అజయ్ జైన్ కు వివరించారు. ఇక్కడ చేపట్టిన పనులు, సాధించిన ఫలితాలను వెల్లడించారు. పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ జగదీష్, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె. మాధవి, గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి సత్తిబాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జోన్-4లో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖ నగరంలో మండుటెండలు విపరీతంగా ఉన్నందున వేసవి తాపానికి నగర ప్రజలు గురికాకుండా ఉండేందుకు మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ అన్ని జోన్లలో ప్రజల కొరకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడమైనదని, ఆ వేసవి తాపానికి నగర ప్రజలు గురికాకుండా జీవీఎంసీ పలు పర్యావరణహిత మైన చర్యలను చేపడుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జోన్-4లో గల జీవిఎంసీ ప్రధాన కార్యాలయ సమీపంలో పర్యావరణహిత చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన చలివేంద్రానికి వచ్చిన ప్రజలకు చల్లని తాగునీటిని స్వయంగా మేయర్ అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవిలో మండుటెండలకు భూమి వేడెక్కి నగర ప్రజలు ఒకరకమైన ఇబ్బందికి గురవుతున్నారని, ఇప్పటికే జీవిఎంసీ అన్ని జోన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసిందని, జీవిఎంసీతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయని, నగర ప్రజలు వేసవి తాపానికి గురికాకుండా ఇటువంటి చలివేంద్రాలని మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి ప్రజలకు చల్లని నీటిని అందించాలని మేయర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నేపథ్యంలో విశాఖ నగరంలో వచ్చినటువంటి అభివృద్ధి చేసే పథంలో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి చెట్లను పెంచుతూ, ప్రతి భవనంపై పచ్చదనాన్ని పెంపొందిస్తూ ఈ నగర చల్లని వాతావరణానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని, తద్వారా వేసవి తాపానికి నగర ప్రజలు గురికాకుండా ఆరోగ్యంగా జీవించగలరని విశాఖ నగర మేయర్‌గా ఈ నగర అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో 76 వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జీవిఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, ఆఫీస్ ఇంచార్జ్ సహాయక ఇంజినీర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సంవత్సరంలోగా డిగ్రీ కాలేజీ భవన నిర్మాణం

గంటా చొరవతో ఆనందపురం ప్రజల కోరిక సహకారం

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఏడాదిలోగా భవన నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో టెండరు ఖరారు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏ.పి.ఇ.డబ్ల్యు.ఐ.డి.సి) చీఫ్ ఇంజనీర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో డిగ్రీ చదువు కోసం ప్రజలు దూరప్రాంతాలకు పంపిస్తున్న ఆనందపురం పరిసర ప్రాంత వాసుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీ ఏర్పాటు విషయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీసుకున్న చొరవకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం తరగతులను కేజీబీవీ స్కూల్ నడుస్తున్న డిగ్రీ కాలేజీ భవన నిమిత్తం కోసం పీఎం ఉషా పథకం కింద రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. అయితే అనువైన ప్రభుత్వ స్థలం దొరక్కపోవడంతో ఆ నిధులు మురిగిపోయే పరిస్థితి వచ్చింది. కాలేజీ ప్రిన్సిపల్ శ్రీవాణి నిధుల వినియోగానికి గడువు మీరిపోతున్న విషయాన్ని గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తో మాట్లాడారు. ఆనందపురం హైస్కూల్ దగ్గర 5 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న విషయాన్ని చెప్పారు. భూ కేటాయింపు అనంతరం విద్యా శాఖ ఉన్నతాధికారులతో పలు దఫాలు మాట్లాడారు. భవన నిర్మాణం వేగంగా జరగాలని ఎమ్మెల్యే గంటా ఒత్తిడి తేవడంతో కేవలం రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తయ్యి పనులు మొదలుపెట్టే దశకు చేరాయి. మొదటి 4 నెలల్లో 30 శాతం, 8 నెలల్లో 70 శాతం, ఏడాదిలో వంద శాతం పనులు పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్ కు ఆ ఉత్తర్వుల్లో అధికారులు నిర్దేశించారు. హైస్కూల్, జూనియర్ కాలేజీ సమీపంలోనే డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు కానుండడంతో ఒకే క్యాంపస్ లో అన్ని దశల విద్యార్థుల అందుబాటులోకి రానుందని ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.

పెన్షనర్ల సంఘ భవనానికి స్థల మంజూరుకు కృషి

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి స్థల కేటాయింపునకు ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్‌కు వినతి పత్రం అందించారు. శుక్రవారం ఆమదాలవలస పెన్షనర్స్ సంఘ కార్యవర్గ సభ్యులు సంఘ భవన నిర్మాణం కొరకు పట్టణంలో స్థలం మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే రవికుమార్ సానుకూలంగా స్పందిస్తూ పెన్షనర్స్ సంఘ భవన నిర్మాణం కొరకు స్థలాన్ని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీనికి సంఘ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు మరియు కార్యవర్గ సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు. కోశాధికారి పేడాడ వి.సత్యనారాయణ, రిటైర్డ్ ఎమ్మార్వో జల్లేపల్లి రాజారావు, సంఘ నాయకులు డి.లక్ష్మణరావు, ఆర్ సత్యనారాయణ, బీవీ రమణ, బి.సూర్య నారాయణ, కె షణ్ముఖరావు, పేడాడ భానుతేజా, డి.శ్రీరామమూర్తి, ఎన్.వాసుదేవరావు, జె నరసింహారావు, పి.భుజంగరావు, బలివాడ వెంకట రమణ, పి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్ జవాన్లకు మద్దతుగా ఎమ్మెల్యే ఎంజిఆర్ ర్యాలీ

విశాలాంధ్ర-హిరమండలం /పాతపట్నం: మన ఇండియాపై దెబ్బతీసిన పాకిస్తాన్ పికి పందలకు ఆపరేషన్ సింధూర్ ద్వారా తగిన బుద్ధి చెప్పిన మనదేశ సైనికుల సాహసం ఎంతో గొప్పదని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం మెయిన్ రోడ్ గంధం జాతీయ జెండాతో శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా చేపట్టిన మన భారత సైనికులకు సంఘీభావంగా శుక్రవారం సాయంత్రం పాతపట్నం పోర్ట్ ఆఫీస్ నుండి ఆల్ ఆంధ్ర రోడ్ వరకు జాతీయ జెండాలతో పట్టణంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో పలువురు వ్యాపారస్తులు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజలు, విద్యార్థులు, వివిధ హోదాలలో ఉన్న ఉద్యోగస్తులు, ఎక్స్ ఆర్మీ ఉద్యోగస్తులు,అలాగే యువతి యువకులు చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు పాతపట్నం నియోజకవర్గంలో లో అన్ని మండలాల ప్రజలు పట్టణ మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలంతా పాల్గొని విజయవంతంచేశారు.మన భారతదేశంపై దాడులు జరిగితే ఎటువంటి బుద్ధి చెప్పాలో మన ఆర్మీ జవాన్లు ఐదేళ్ల జరిగిన ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పడం గర్వంగా ఉందన్నారు. మనందరం చేసే కార్యక్రమం భవిష్యత్ తరాలకు ఆదర్శం కావాలనిఎమ్మెల్యే పిలుపు నిచ్చారు జై జవాన్ జై జవాన్ వందేమాతరం వందేమాతరం అంటూ పాతపట్నం మార్మోగి పోయింది. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్మీ విశ్రాంతి ఉద్యోగులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : గ్రామాలలో ఉండే ప్రజలు ఐక్యమత్యం, దేశభక్తిని శుక్రవారం గ్రామస్తులు చాటుకున్నారు. మండలంలోని తిర్లింగి పంచాయితీ గంగాడ పేటలో ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకొని సంఘీభావం తెలిపారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయానికి అభినందనలు తెలుపుతూ భారత్ మాతాకీ జై, జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో కొన్ని వీధులలో ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, ఉగ్రవాదుల ప్రాణాలను తీసిన ఉగ్రవాదులను ఏ ఒక్కరి పాకిస్తాన్ ప్రాణాలు కూడా ఉండకూడదని అన్నారు. ఇటీవల దాడిలో మన రాష్ట్రానికి చెందిన జవాన్లు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ జవాన్లు కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేగానిగూడెంలో పూరిల్లు దగ్ధం : రూ.35 వేలు ఆస్తి నష్టం

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ రేగాని గూడెంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన రేగాని పైడమ్మ భర్త (లేట) ఒగులు పూరి గుడిసెలో వంట చెరుకు కారణంగా నిప్పు అంటుకుని పూరిల్లు దగ్ధం అయింది. స్థానికులు తాళవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన చేరుకొని మంటలను అదుపు చేశారు. పురిపాకలో ఉన్న బట్టలు సామాన్లు కాలిపోయాయి. సుమారు 35,000 ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు పరిశీలన చేశారు. చుట్టుపక్కల ఇల్లు ఉండడం మంటలను అదుపులో తీసుకురావడంతో గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు. పేదవారైన పైడమ్మకు ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత కుట్టు మిషన్ యూనిట్ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-పోలాకి: మండలంలో దండు లక్ష్మీపురం గ్రామంలో ఉచిత కుట్టు మిషన్ కేంద్రం ను శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నుండి మహిళ సోదరీమణులకు ఆర్థికంగా ఆదుకోవాలని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా ఆ గ్రామంలో మహిళా సోదరీమణులు పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి అని ప్రతీ రంగంలో మహిళలు ఆర్థికంగా ముందంజలో ఉండాలనే దృక్పథంతో చేయూతను అందజేస్తూ మహిళలు పెద్దపీట వెయ్యడం జరుగుతుందని అన్నారు. ప్రతీ ఒక్క మహిళ దీనిని వినియోగించుకొని ఆర్థికంగా ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మెరుగుమల్లి వెంకటప్పలనాయుడు, బైరి భాస్కర్ రావు రోనంకి కృష్ణం నాయుడు, స్థానిక సర్పంచ్ తమ్మినేని వెంకటరత్నం, డోల ప్రసాద్ సూరపు నారాయణదాసు, మండల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.